నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌టౌన్, సెప్టెంబర్ 9 : షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం ఉష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన సేవలు అందించడం కోసం ప్రతి నెల ఈ డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆర్టీసీ ప్రయాణికులకు ఆర్టీసీ ద్వారా ఎలాంటి సమస్యలు ఉన్నా డయల్ యువర్ డీఎం సెల్ నం.9959226287 ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు.

ఆశ్రమ పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

కడ్తాల్, సెప్టెంబర్ 9 : మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో గల గిరిజన ఆశ్రమ పాఠశాలలో వివిధ సబ్జెక్ట్‌లను బోధించుటకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం బాలరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలో 2024-25 సంవత్సరానికి గానూ కాంట్రాక్ట్ పద్ధతిలో బోధనా సిబ్బందిని నియమించేందుకు ఇంగ్లిష్ మీడియం అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆంగ్లం-స్కూల్ అసిస్టెంట్, సోషల్-స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్‌ల్లో పీజీ, డిగ్రీతోపాటు, బీఈడీ, టెట్ అర్హత కలిగి ఉండాలని తెలిపారు. అర్హతలున్న అభ్యర్థులు ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజీలో నమోదై ఉండాలన్నారు. అభ్యర్థుల వయస్సు 01-07-2020 నాటికి 18 నుంచి 39 సంవత్సరాలు.. రిజర్వేషన్ కేటగిరికి 45 ఏండ్లు కలిగి ఉండాలని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలానికి చెందిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అదనపు అర్హతలు, బోధనా అనుభవం ఉన్న అభ్యర్థులకు వెయిటేజీ మార్కులు ఉంటాయని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు జిల్లా కలెక్టర్ కార్యాలయం సముదాయంలోని జిల్లా గిరిజ నాభివృద్ధి కార్యాలయంలో, 10-08-2024 నుంచి 18-09-2024 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు గౌరవ వేతనం రూ.28,977 ఉంటుందని తెలిపారు.

మద్యం దుకాణంలో అగ్నిప్రమాదం

తుర్కయాంజాల్, సెప్టెంబర్ 9 : మద్యం దుకాణంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఉంచిన దీపంతో మంటలు చెలరేగి ప్రమాదం చోటు చేసుకున్న సంఘటన తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధి కమ్మగూడలోని ఎస్ ఆర్ మద్యం దుకాణంలో వినాయక నవ రాత్రుల సందర్భంగా వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. రోజులాగే ఆదివారం రాత్రి సిబ్బంది దుకాణాన్ని మూసి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం మద్యం దుకాణంపై నుంచి పొగ రావడాన్ని గమనించిన టిఫిన్ సెంటర్ నిర్వాహకులు మద్యం దుకాణ యాజమానులకు తెలియజేశారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న యజమానులు కొంత మద్యం అగ్ని ప్రమాదంలో కాలిపోవడాన్ని గమనించారు. వెంటనే స్థానికుల సహాయంతో మంటలను ఆర్పివేశారు.

జూలై వేతనాలు మంజూరు చేయాలి

యాచారం, సెప్టెంబర్ 9 : ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం జూలై నెల వేతనాలు చెల్లించకపోవడం బాధాకరమని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, పత్రికా సంపాదకవర్గ సభ్యుడు జగన్‌మోహన్‌గుప్తా అన్నారు. మండలంలోని గడ్డమల్లాయగూడ, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, కుర్మిద్ద, తులేఖుర్దు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సోమవారం సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.

సమస్యలను పరిష్కరించడంలో పీఆర్టీయూ ముందుంటుంది

కడ్తాల్, సెప్టెంబర్ 9 : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పీఆర్టీయూ ముందుంటుందని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ యాదవ్ అన్నారు. సోమవారం కడ్తాల్‌లోని మండల రీసోర్స్ భవనంలో ఏర్పాటు చేసిన పీఆర్టీయూ మండల శాఖ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా పద్మావతమ్మ, ప్రధాన కార్యదర్శిగా చీమర్ల రాధాకృష్ణారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా వెంకటేశ్, మహిళ ఉపాధ్యక్షురాలిగా భాగ్యమ్మ, కార్యదర్శిగా రామ్మోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కొత్త కమిటీ సభ్యులతో గోవర్ధన్‌యాదవ్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, మాడ్గుల మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, మాజీ గౌరవ అధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాల ప్రతిధ్వని కాళోజీ

- జిల్లాలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం
- కాళోజీ చిత్రపటాలకు నివాళులర్పించిన ప్రముఖులు

మొయినాబాద్ : చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాలలో..


ఇబ్రహీంపట్నంరూరల్ : కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

మొయినాబాద్, సెప్టెంబర్ 9 : అన్యాయాలను ఎదిరిస్తూ ప్రజా ఉద్యమాలు చేస్తూ ప్రతిధ్వనిగా నిలిచిన కాళోజీ నారాయణరావును నేటి విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ మాలతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తోలుకట్టా గ్రామ సమీపంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఓ విద్యార్థిని కాళోజీ నారాయణరావు వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా వివిధ అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వినోలియా, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భాషా నైపుణ్యతను అలవర్చుకోవాలి

షాద్‌నగర్‌టౌన్ : షాద్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు తెలుగు భాషా నైపుణ్యతను అలవర్చుకోవాలన్నారు. ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక అని ప్రజా కవి కాళోజీ నారాయణరావు ప్రస్తావించిన అంశాన్ని, కాలోజీ నారాయణరావు బాల్యం, విద్యాభ్యాసం, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తీరును విద్యార్థులకు అర్థమయ్యేలా పలువురు అధ్యాపకులు వివరించారు. కార్యక్రమంలో అకాడమిక్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు, అధ్యాపకులున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

ఇబ్రహీంపట్నంరూరల్ : ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అసోసియేషన్ ప్రొఫెసర్ భుజంగరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ భాష జీవ భాష అని.. ఇతర భాషా పదాలన్నింటినీ తనలో కలుపుకని జీవనదిలా నిరంతరం ప్రవహించే పలుకుబడుల భాష అని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, తెలుగు విభాగం అధ్యక్షుడు సురేశ్, అధ్యాపకులున్నారు.

ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో..

తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పీఆర్‌టీయూ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు వర్కాల పరమేశ్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండలం విద్యావనరుల కేంద్రం ఆవరణలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పరమేశ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు కాళోజీ గొడవ అనే పేరుతో అనేక కవితలు రాశారని తెలిపారు.

షాద్‌నగర్‌టౌన్ : మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి


షాబాద్ : గోల్డ్ ఫేజ్ కాలనీలో పూజలు చేస్తున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

పూజలందుకుంటున్న గణనాథులు

కడ్తాల్ : మైసిగండి గ్రామంలో అన్నదానం

ఆమనగల్లు : శ్రీకాంత్‌కాలనీలో భజన..

కడ్తాల్, సెప్టెంబర్ 9 : మండల కేంద్రంతోపాటు పరిధిలోని గ్రామాలు, తండాల్లో ప్రతిష్ఠించిన గణనాథులు నిత్య పూజలందుకుంటున్నారు. ప్రతి రోజూ ఉదయం, రాత్రి వేళ్లలో వినాయకులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గణనాథులకు పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. రాత్రి పూట మండపాల వద్ద భజనలు, యువకులు క్రీడలు ఆడుతుండగా, మహిళలు బతుకమ్మలు ఆడుతున్నారు. సోమవారం మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి జవహర్‌లాల్ నాయక్-ప్రేమ దంపతులు పూజలు చేసి అన్నదానం నిర్వహించారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

షాబాద్ : ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం షాబాద్‌లోని గోల్డ్‌ఫేజ్ కాలనీలో ప్రతిష్ఠించిన వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. షాబాద్‌లోని గణనాథుడికి సీఐ కాంతారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులున్నారు.

ఆమనగల్లు మండలంలో..

ఆమనగల్లు : గణనాథుని నవరాత్రులను పురస్కరించుకుని ఆమనగల్లు మున్సిపాలిటీతోపాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో అంగరంగ వైభవంగా భక్తులు, నిర్వాహకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు, అన్నదానం నిర్వహించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బైక్ ఇద్దరు యువకులు దుర్మరణం

షాద్‌నగర్, సెప్టెంబర్ 9 : రోడ్డుపై ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టగా.. ఇద్దరు యువకులు మృతిచెందిన విషాద ఘటన ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామ సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. షాద్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. కొందుర్గు మండలం రేగడిచిల్కమర్రి గ్రామానికి చెందిన చాకలి కరుణాకర్(20), పులుసుమామిడి గ్రామానికి చెందిన ప్రైవేట్ బస్సు డ్రైవర్ రెడ్డి శేఖర్(25) అనే ఇద్దరు యువకులు తమ సొంత పనుల కోసం ఆదివారం బైక్‌పై షాద్‌నగర్‌కు వెళ్లారు. పనులు ముగించుకొని సోమవారం తెల్లవారుజామున ఇంటికి వస్తుండగా ఎలికట్ట చౌరస్తా సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కరుణాకర్, శేఖర్‌లకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతిచెందారు. రోడ్డు ప్రమాద సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాలను షాద్‌నగర్ సర్కారు దవాఖానకు తరలించామని పోలీసులు తెలిపారు. జరిగిన ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ బలరామ్ పేర్కొన్నారు. ఇద్దరి మృతితో రేగడిచిల్కమర్రి, పులుసుమామిడి గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొన్నది. చేతికి వచ్చిన కుమారులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఇరువురి కుటుంబ సభ్యుల రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. రాత్రి వేళల్లో వాహనాలను వేగంగ నడుపరాదని, వాహనాల నియంత్రణ డ్రైవర్ల చేతిలో ఉండేలా జాగ్రత్తపడాలని ఈ సందర్భంగా పోలీసులు సూచించారు.

నేడు షాబాద్‌లో చాకలి ఐలమ్మ వర్ధంతి

షాబాద్, సెప్టెంబర్ 9 : నేడు షాబాద్‌లో తెలంగాణ సాయుధ పోరాట వీర నారి చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రజకసంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు గడ్డం చంద్రయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

ఆమనగల్లు, సెప్టెంబర్ 9 : వినాయక నిమజ్జనాన్ని ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి సూచించారు. ఆమనగల్లులోని వినాయక నిమజ్జన చేసే సురసముద్రం చెరువును సోమవారం సీఐ ప్రమోద్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ తిరుపతయ్య, మున్సిపల్ కమిషనర్ వసంతతో కలిసి పరిశీలించారు. సురసముద్రం చెరువు కట్టపై పాక్షికంగా దెబ్బతిన్న ప్రదేశాన్ని పరిశీలించి ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా చూడాలని ఏఈ, కమిషనర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. వినాయకులను నిమజ్జనం చేసే సందర్భంలో గణేశ్ మండప నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీసుల సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్, ఆర్ఐ చెన్నకేశవులు పాల్గొన్నారు.

విద్యార్థినులను కంటికి రెప్పలా చూసుకోవాలి

కడ్తాల్ (తలకొండపల్లి), సెప్టెంబర్ 9 : కస్తూర్బాగాంధీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులను ఉపాధ్యాయులు కంటికి రెప్పలా చూసుకోవాలని మండల విద్యాధికారి సర్దార్‌నాయక్ సూచించారు. సోమవారం తలకొండపల్లిలోని కేజీబీవీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను, ఉపాధ్యాయుల హాజరు పట్టికను, తరగతి, విశ్రాంతి గదులను, వంటశాల, మరుగుదొడ్లు, స్టాక్ రూంను ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థినులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కేజీబీవీనీ ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో చుక్కాపూర్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రామనాథం పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 9 : మండలంలోని లష్కర్‌గూడ గ్రామానికి చెందిన కొండూరి కిషన్ 22.7.2020న మృతిచెందాడు. ఆయన భార్య లావణ్యకు మండల కేంద్రంలోని సంఘం ప్రధాన కార్యాలయంలో సోమవారం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్‌యాదవ్ రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం సహకార సంఘం కృషిచేస్తుందన్నారు. సంఘంలో సభ్యులెవరైనా మరణిస్తే వారి కుటుంబానికి సంఘం తరఫున ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బాలనర్సింహ, మహేందర్‌రెడ్డి, రాములు, మహిపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి మేనేజర్ రాకేశ్‌గౌడ్ ఉన్నారు.

గిరిజనులకు వెంటనే రిజర్వేషన్లు పెంచాలి

కడ్తాల్, సెప్టెంబర్ 9 : గిరిజనులకు వెంటనే రిజర్వేషన్లను పెంచాలని పలువురు గిరిజన నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కడ్తాలోని గిరిజన భవన్ వద్ద సేవాలాల్ సేన 10వ వార్షికోత్సవాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన జెండాను రాష్ట్ర కార్యదర్శి లక్పతినాయక్ స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. గిరిజనులకు పది శాతం రిజర్వేషన్ పెంపునకు సంబంధించిన జీవో నం.33కు వెంటనే చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రఘురాం రాథోడ్, సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షుడు భీంలాల్ పవార్ తదితరులున్నారు.

సామాసి కుంట మరమ్మతు పనులు చేపడుతున్న ఇరిగేషన్ అధికారులు

సామాసి కుంటకు మరమ్మతులు

కడ్తాల్, సెప్టెంబర్ 9 : మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వానలకు చెరువులు, కుంటలు నిండి అలుగు పారుతున్నాయి. మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామంలో గల సామాసికుంట, నాగుల చెరువుకు గండి పడ్డాయి. దీంతో చల్లంపల్లి గ్రామం నుంచి పొలాలకు వెళ్లే రైతులతోపాటు పలు గ్రామాలకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. గండి పడిన విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, గండి పడిన చెరువులను ఆయన పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. ఇరిగేషన్ ఏఈ నిఖిల పర్యవేక్షణలో సామాసి కుంటకు మరమ్మతు పనులు చేపట్టారు. తెగిన కుంటకు పైపులు ఏర్పాటు చేసి మట్టి పోశారు. నాగుల చెరువుకు రెండు రోజుల్లో మరమ్మతు పనులు చేపడతామని ఏఈ పేర్కొన్నారు.

ఆర్థిక సంఘం నిధులను జనాభా ప్రకారం కేటాయించాలి

కడ్తాల్, సెప్టెంబర్ 9 : తెలంగాణ ప్రజా భవన్‌లో సోమవారం 16వ ఆర్థిక సంఘం చైర్మన్ డాక్టర్ అరవింద్ పనాగరియా అధ్యక్షతన.. రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి లోకేశ్‌కుమార్, కమిషనర్ అనితారామచంద్రన్, ఫైనాన్స్ కమిషనర్ రామకృష్ణారావు, తాజా మాజీ ప్రజాప్రతినిధులతో కలిపి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర 16వ ఆర్థిక సంఘంలో చేర్చాల్సిన పలు అంశాలను అధికారులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులను అడిగి తెలుసుకున్నట్లు సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. కేంద్రం నుంచి గ్రామపంచాయతీలకు 85 శాతం, మండల పరిషత్‌లకు 10 శాతం, జిల్లా పరిషత్‌లకు 5 శాతం చొప్పున అందుతున్న నిధుల వినియోగం గురించి ప్రజాప్రతినిధుల నుంచి అధికారులు సమాచారం సేకరించినట్లు ఆయన పేర్కొన్నారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలను, వ్యవసాయ రంగానికి అనుసంధానం చేసి రైతులకు ఉపయోగపడేలా చూడాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామపంచాయతీలకు వచ్చే నిధులను నేరుగా జీపీలకే అందించాలని, 2011 జనాభా లెక్కల ప్రకారం కాకుండా 2024-25 జనాభా మేరకు జీపీలకు నిధులు కేటాయించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్రం ఏడాదికి ఒక్కరికి అందిస్తున్న రూ.816లను రూ.1,632కి పెంచాలని కోరినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల కరెంట్ బిల్లులను ప్రభుత్వమే భరించాలని, పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. మిషన్ భగీరథ పనుల నిర్వహణను జీపీలకు అప్పగించి ప్రత్యేక నిధులు కేటాయించాలని, అన్ని శాఖల అధికారులను గ్రామసభలకు హాజరయ్యేలా చూడాలన్నారు. గ్రామాల్లో పన్నులు విధించే అధికారం జీపీలకే ఉండాలని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సర్పంచ్‌లకు గౌరవ వేతనం అందించాలన్నారు. సొంత ఆదాయ వనరులు పెంపొందినప్పుడే గ్రామపంచాయతీలు అభివృద్ధి సాధిస్తాయని సమావేశంలో సూచించినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ విశాల, మాజీ ఎంపీపీ పద్మ, మాజీ సర్పంచ్‌లున్నారు.

చించోడు గ్రామంలోని బ్రహ్మ చెరువు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చించోడు బ్రహ్మ చెరువు వద్ద ఎమ్మెల్యే శంకర్ పూజలు

షాద్‌నగర్/షాద్‌నగర్‌రూరల్, సెప్టెంబర్ 9 : ఫరూఖ్‌నగర్ మండలం చించోడు గ్రామంలోని బ్రహ్మ చెరువు వద్ద ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు బ్రహ్మ చెరువు కత్వా పారుతుండంతో సంతోషం వ్యక్తం చేస్తూ గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించినట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివరించారు. చెరువులతో గ్రామాల ప్రజలకు ఆదెరువు ఉంటుందని.. రైతులు, మత్స్య కార్మికులు మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. వచ్చే వేసవి కాలంలో భూగర్భ జలాలకు లోటు ఉండదని, సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలోని రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కుట్టబడి ఉందనే విషయాన్ని గ్రామాల రైతులు గ్రహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, రైతులున్నారు.

ఎస్సీ, ఎస్టీ రైట్ ప్రొటెక్షన్ సొసైటీ జాతీయ ఉపాధ్యక్షుడిగా సిద్దార్థ

షాద్‌నగర్, సెప్టెంబర్ 9 : ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్ ప్రొటెక్షన్ సొసైటీ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బాదెపల్లి సిద్దార్థ నియమితులయ్యారు. ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు మురళీధర్‌రావు హైదరాబాద్‌లో నియామకపత్రాన్ని అందజేశారని సిద్దార్థ పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం గత కొన్నాళ్లుగా ఎస్సీ, ఎస్టీ రైట్ ప్రొటెక్షన్ సొసైటీ పనిచేస్తుందని చెప్పారు. రాజ్యాంగం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు కల్పించిన హక్కుల పరిరక్షణ కోసం సొసైటీ పాటుపడుతుందని వివరించారు. బాదేపల్లి సిద్దార్థకు జాతీయ స్థాయిలో పదవి రావడం పట్ల మండలానికి చెందిన పలువురు నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.

మండలానికి నిధులు కేటాయించాలని..

నూతన మండలం కడ్తాల్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిని కడ్తాల్ మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో ఆయనను నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. - కడ్తాల్, సెప్టెంబర్ 9

ఎంపీడీవోకు వినతిపత్రమిస్తున్న బాధిత రైతు, గ్రామస్తులు

సిబ్బంది నిర్లక్ష్యంతో పంట నష్టం

చేవెళ్లటౌన్, సెప్టెంబర్ 9 : చేవెళ్ల మండల పరిధిలోని గొల్లగూడ గ్రామంలో ఆ గ్రామ కార్యదర్శి మురళీకృష్ణ రోడ్డుపై గడ్డి మందు పిచికారీ చేస్తూ పక్కనే ఉన్న వరి పొలంపై కూడా పిచికారీ చేయడంతో పంట మాడిపోయిందని రైతు శ్రీశైలం సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఇలా ఎందుకు చేశారని అడగగా.. చాలా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని బాధిత రైతు ఆరోపిస్తున్నారు. దీనికి కారణమైన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులతో చర్చించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

బండలేమూరు, పార్లగడ్డతండా రోడ్డు

వర్షాలకు దెబ్బతిన్న రోడ్డు

మంచాల, సెప్టెంబర్ 9 : మంచాల మండలం బండలేమూరు నుంచి పార్లగడ్డ తండా, నారాయణపూర్, చౌటుప్పల్‌తో పాటు తదితర గ్రామాల ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సు సర్వీస్ నడుస్తున్నది. గతంలో కురిసిన వర్షాలతో ఈ రోడ్డు మొత్తం కంకర తేలడమే కాకుండా కనీసం పాదచారులు కూడా నడవలేని పరిస్థితికి చేరుకున్నది. దీంతో ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీస్‌ను నిలిపి వేయడంతో ఈ గ్రామాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రెండు జిల్లాల అనుసంధానమైన రోడ్డుకు మరమ్మతులు చేయించి ఆర్టీసీ బస్సుతో పాటు వాహనాల రాకపోకలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

దశలవారీగా ఆదిబట్ల మున్సిపాలిటీ అభివృద్ధి

చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి

ఆదిబట్ల, సెప్టెంబర్ 9 : దశలవారీగా ఆదిబట్ల మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తానని ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని మంగళ్‌పల్లి పటేల్‌గూడలోని 12వ వార్డులోని శివారెడ్డి కాలనీలో రూ.5 లక్షలతో యంజాల యాదగిరి ఇంటి నుంచి ధన్‌రాజ్ ఇంటి